ప్రమాదకర మలుపులు

- ఆదమరిస్తే అంతే సంగతులు
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు మూలమలుపుల వద్ద ప్రమాదకరంగా మారగా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొత్తపల్లి నుంచి తాటికొండ, జిట్టెగూడెం, నర్మెట రోడ్డు, కొత్తపల్లి నుంచి మీదికొండ, రఘునాథపల్లికి వెళ్లే రోడ్డు, ఇప్పగూడెం నుంచి అక్కపల్లిగూడెం, రంగరాయగూడెం, కోమటిగూడెం వెళ్లే రోడ్లపై మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రస్తుతం రోడ్డు పక్కన చెట్లకొమ్మలు ఏపుగా పెరగడంతో మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించే పరిస్థితి లేకుండాపోయింది. ఆయా రోడ్లపై నిత్యం ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాల్లో ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఏళ్ల క్రితం వేసిన బీటీ రోడ్లు, దానికి తోడు రోడ్డు పక్కన దట్టంగా, ఏపుగా పెరిగిన చెట్లతో ప్రమాదకరంగా మారాయి. రోడ్డుపై వెళ్లాలంటే మూలమలుపుల వద్ద ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మలుపులు దాటే వరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ముందుకు వెళ్తున్నారు.


ప్రమాదకరంగా ఉన్న కోమటిగూడెం రోడ్డు


అక్కపెల్లిగూడెం వెళ్లే రోడ్డులో మూలమలుపు

చీకటి పడితే ప్రమాదకరమే..

ఆయా రోడ్లపై రాత్రిపూట ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వ్యవసాయ బావుల వద్దకు సైకిళ్లు, ద్విచక్రవాహనాలు, కాలినడకన వెళ్లే వారు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోంది. గతంలో వ్యవసాయ బావుల వద్దకు వెళ్తూ పలువురు రోడ్డు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. చెట్ల కొమ్మలను తొలగించాలని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగాక చింతించేకన్నా ముందస్తుగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటే బావుంటుందని ప్రజలు కోరుతున్నారు. కనీసం ఉపాధి హామీ పథకంలోనైనా రోడ్ల పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేయించాలని వేడుకుంటున్నారు. అదేవిధంగా మూలమలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్



జనగామ : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జనగామ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ సత్యనారాయణరెడ్డి శుక్రవారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి కేసులు, భూ సంబంధిత సమస్యల జోలికి వెళ్లరాదన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై నిత్యం నిఘా ఉంటుందని, ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీటీఓలుగా ఎంపిక


కొడారి గీత


లున్సావత్ దివ్య

జఫర్‌గఢ్ /నర్మెట: ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్–1 పరీక్ష ఫలితాల్లో కొడారి గీత, లున్సావత్ దివ్య కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ (సీటీఓ) ఉద్యోగానికి ఎంపికయ్యారు. జఫర్‌గఢ్ మండలంలోని ఉప్పుగల్లు గ్రామానికి చెందిన కొడారి గీత తొలి ప్రయత్నంలోనే 121ర్యాంకు సాధించింది. అలాగే నర్మెట మండలంలోని బొమ్మకూర్‌కు చెందిన లున్సావత్ దివ్య 296వ ర్యాంకు సాధించి సీటీఓ(కమర్షియల్ టాక్స్ ఆఫీసర్) గా ఎంపికయ్యారు. రైతు కుటుంబానికి చెందిన వీరు కష్టపడి ప్రభుత్వ కొలువు సాధించడంతో శుక్రవారం కుటుంబీకులతో పాటు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్‌కు ఆరురోజులు సెలవులు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్‌కు సద్దుల బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ఈనెల 28నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు వరుసగా ఆరురోజులు సెలవులు ఉంటాయని ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, సెక్రటరీ జన్ను భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.


సమస్యలు పరిష్కరించాలి



చిల్పూరు : మండల కేంద్రంలోని నాలుగో వార్డులో రోడ్డు, డ్రెయినేజీ సమస్య తీర్చాలంటూ శుక్రవారం వర్షంలో స్థానికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జంగం సాంబరాజు యాదవ్, బోడ రాజయ్య, సూర్ణ లచ్చయ్య, బుర్ర కొమురమ్మ, వెలిశాల సరోజన తదితరులు మాట్లాడారు. మండల కేంద్రంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించినా తమ వార్డులో నేటికి ఎలాంటి అభివృద్ధి చేయక పోవడంతో చిన్న వర్షం పడినా రోడ్డుపై ఎక్కడి నీరు అక్కడే నిలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ వార్డులోని సమస్యను పరిష్కరించాలని కోరారు.

రైతు సంఘం కమిటీ ఎన్నిక




నూతన అధ్యక్ష, కార్యదర్శి

బచ్చన్నపేట : రైతు సంఘం మండల కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాపర్తి సోమయ్య, భూక్య చందునాయక్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఏడబోయిన రవీందర్‌రెడ్డి, కార్యదర్శిగా బెల్లం కొండ వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు.

దమ్ముంటే రాజీనామా చేసి పోటీచేయి

- కడియం శ్రీహరికి మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సవాల్


మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

రఘునాథపల్లి : అబద్ధాలతో కాలం గడుపుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరికి దమ్ముంటే రాజీనామా చేసి కాంగ్రెస్ నుంచి పోటీచేయాలని.. అప్పుడు చెప్పుల దండలు వేయాలో, పూల దండలు వేయాలో ప్రజలు నిర్ణయిస్తారని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సవాల్ విసిరారు. శుక్రవారం మండలంలోని ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, లక్ష్మీతండా, సోమయ్యకుంటతండా, మాధారం, ఖిలాషాపూర్, మండలగూడెం, మంగళిబండతండా, పాట్టిగుబ్బటితండా, ఆంధ్రతండా, గిద్దబండతండా, రామరాయనిబంగ్లా, మేకలగట్టులో ఊరూరా బీఆర్‌ఎస్ అభివృద్ధి సంక్షేమాలు, ఇంటింటికి కేసీఆర్ పథకాలు అనే పేరుతో గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఖిలాషాపూర్‌లో మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల కాలంలో ప్రతి గ్రామం గొప్పగా అభివృద్ధి చెందిందని, ఇప్పుడు రెండేళ్లకే ప్రజలు అష్టకష్టాలు అనుభవిస్తున్నారన్నారు. ఓటుకు నోటు కేసులో మత్తయ్య చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో రేవంత్‌రెడ్డి పాత్రపై సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుమార్‌గౌడ్, మండల కోఆర్డినేటర్ ముసిపట్ల విజయ్, నాయకులు గూడ కిరణ్, గవ్వాని నాగేశ్వర్, రాజేందర్‌నాయక్, కావటి రాజయ్య, మడ్లపల్లి సునిత, శాగ నాగరాజు, శంకర్, కావటి యాదగిరి, గోపాల్‌నాయక్, యాకయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగబద్ధంగానే ఎస్టీలో చేర్చారు


సమావేశంలో అభివాదం చేస్తున్న లంబాడీ జేఏసీ నాయకులు

పాలకుర్తి టౌన్ : రాజ్యాంగబద్ధంగానే లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చారని లంబాడీ జేఏసీ రాష్ట్ర కమిటీ కన్వీనర్ భూక్య జైసింగ్ రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో లంబాడీ జేఏసీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని బంజారా ద్రోహులు తెల్లం వెంకట్రావ్, సోయం బాబురావు చేస్తున్న కుట్రను తిప్పి కొట్టాలన్నారు. ఎస్టీ జాబితాలో లంబాడీలను అక్రమంగా చేర్చలేదని, భారత పార్లమెంట్‌లో చట్ట సవరణ–1976లో ఆర్టికల్ 342 ప్రకారం ఎస్టీ జాబితాలో లంబాడీలను చేర్చారని పేర్కొన్నారు. లంబాడీ, బంజారాల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి ఏంటో స్పష్టం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు జాటోత్ కిషన్ నాయక్, ధరావత్ బైసింగ్ నాయక్, బానోత్ మహేందర్ నాయక్, వెంకట్, నాగరాజు, సురేష్ నాయక్, యాకూబ్ నాయక్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళి



పాలకుర్తి టౌన్ : ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపించిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లావుడ్యి మంజుల, గడ్డం యాకసోమయ్య, శ్రీనివాస్, యాకన్నగౌడ్, ఎల్లయ్య, కుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామ్యంతోనే విద్యార్థుల్లో పురోగతి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజిరెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్ : విద్యార్థుల చదువు విషయంలో తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పురోగతి ఉంటుందని ఘన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్ టీచర్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల క్రమశిక్షణ, విద్యా పురోగతి, ప్రతిభ, సాంస్కృతిక క్రీడా కార్యక్రమాలు, అభ్యసనాలపై ఉపాధ్యాయులు పేరెంట్స్‌తో చర్చించారు. అధ్యాపకులు కమలాకర్, నరేందర్‌రావు, లావణ్య, నవీన్, కరుణాకర్, శ్వేత, ప్రేమ్, థామస్, సందీప్‌తో పాటు పేరెంట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ఉజ్వల భవిష్యత్

దేవరుప్పుల : తల్లిదండ్రులు, అధ్యాపకుల సమష్టి కృషితోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భాస్కర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. విన్ ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జినుగ అరుణాకర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు


నర్మెట: వెల్దండలో పూజలు చేస్తున్న భక్తులు


జనగామ: బాలాజీనగర్‌లో మహాలక్ష్మి అవతారం


ఉప్పలమ్మ ఆలయంలో..


చిల్పూరులో..

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గామాత మహాలక్ష్మి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండపాల వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. – సాక్షి నెట్‌వర్క్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రఘునాథపల్లి : మండలంలోని గోవర్ధనగిరి శివారు మర్రికుంటలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. మర్రికుంట నీటిలో మృతదేహం తేలియాడుతుండగా పొలాల వద్దకు వెళ్లిన రైతులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు 50నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, చామనఛాయ రంగులో నలుపు రంగు చొక్కా, నలుపు ప్యాంట్ ధరించి ఉన్నాడు. కాగా ఎక్కడైనా హత్య చేసి మృతదేహాన్ని నీళ్లలో వేసి వెళ్లారా..? లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు. సమాచారం తెలిస్తే 87126 85211, 87126 85035 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు


స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం పీహెచ్‌సీలో బతుకమ్మ వేడుకల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ


జఫర్‌గఢ్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..


రఘునాథపల్లిలో..


జనగామ రూరల్: బతుకమ్మ సంబురాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్ అన్నారు. ఆయా మండల కేంద్రాల్లో పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. మండల సమాఖ్య సభ్యులు, అంగన్ వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది బతుకమ్మ ఆడి పాడారు. – సాక్షి నెట్‌వర్క్


రఘునాథపల్లి: పోషణమాసంలో అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సరస్వతి

ముంచెత్తిన వర్షం.. పొంగుతున్న వాగులు


దేవరుప్పులలో పొంగి ప్రవహిస్తున్న వాగు


వరద ఉధృతికి మృతి చెందిన ఎద్దు

దేవరుప్పుల : రెండ్రోజులుగా కురుస్తున్న వర్షంతో వాగు పరివాహక ప్రాంతాలు పొంగుతున్నాయి. మండలంలోని రామచంద్రాపురంలోని రామసముద్రం మత్తడి ఉధృతి వద్ద ప్రమాదాలు జరగకుండా ఎస్సై ఊర సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ శ్రీనివాస్, కానిస్టేబుల్ యాకేష్ కాపాలా కాశారు. అలాగే చిన్నమడూరులోని గోపి చెరువు అలుగు కింది కాల్వ మార్చడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వరి, పత్తి నీటమునుగుతున్నాయని వాపోతున్నారు. అధికారులు దృష్టిసారించి అన్నదాతలకు నష్టం వాటిల్లకుండా శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని నీర్మాలలో పిడుగుపాటు, అకాల వర్షం వరదలతో పశువులు మృత్యువాత పడ్డాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు కురిసిన భారీ వర్షంతో నీర్మాలకు చెందిన కాసర్ల సోమిరెడ్డికి చెందిన కాడెద్దు కొట్టుకుపోయి మృతి చెందింది. అలాగే సూదగాని యాదయ్యకు చెందిన పాడి గేదె పిడుగుపాటుకు మృత్యువాత పడింది.

మత్తడి పోస్తున్న నవాబుపేట రిజర్వాయర్

లింగాలఘణపురం : మండలంలోని చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తోడు దేవాదుల ఎత్తిపోతల నీరు రావడంతో మెజారిటీ చెరువులు నిండి మత్తడి పోస్తున్నాయి. నాలుగేళ్ల తర్వాత నవాబుపేట రిజర్వాయర్ పూర్తిగా నిండి మత్తడి పోస్తోంది. అదే విధంగా లింగాలఘణపురం, కొత్తపల్లి, వనపర్తి, నేలపోగుల, బండ్లగూడెం, క్లెం, పటేల్‌గూడెం తదితర గ్రామాల చెరువులు, కుంటలన్నీ మత్తళ్లు పోస్తున్నాయి. వర్షాలు ఆలస్యంగా కురవడంతో వానాకాలం పంట సాగు విస్తీర్ణం తగ్గింది.

విస్నూరు చెరువుకు మత్తడి

పాలకుర్తి టౌన్ : రెండ్రోజులుగా కురిసిన వర్షాలతో మండలంలోని విస్నూరు చెరువు శుక్రవారం మత్తడి పోసింది. చెరువు మత్తడి పోయడంతో గ్రామస్తులు చెరువు మత్తడి వద్ద చేపలు పట్టారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, విజిలెన్స్ అధికారి సంధ్య, క్వాలిటీ అధికారి హర్షవర్ధన్‌రెడ్డి, ఎండీడీఓ రవీందర్, పీఆర్ ఏఈ, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ

జనగామ /జనగామ రూరల్ : జనగామ పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహాన్ని నేడు(శనివారం) ఆవిష్కరిస్తున్నట్లు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవా సమితి అధ్యక్షుడు యెన గందుల కృష్ణ నేత తెలిపారు. అలాగే కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎన్.ఎల్. నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు బతుకమ్మ సంబురాలు

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండల స్థాయి బతుకమ్మ సంబురాలు నేడు (శనివారం) నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మమతాభాయ్ తెలిపారు. అన్ని గ్రామాల మహిళలు, మహిళా ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, వీఓఏలు పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని అన్నారు.

నేడు ఉచిత వైద్యపరీక్షలు

బచ్చన్నపేట : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు నేడు (శనివారం) మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరిటెండెంట్ శ్రీనివాస్ వెల్లడించారు.


సంక్షిప్త సమాచారం

సామాజిక సేవను అలవర్చుకోవాలి



కొడకండ్ల : విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవను అలవర్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ నాయక్ తెలిపారు. శుక్రవారం కొడకండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొండ్రాయిలో నిర్వహించిన శీతాకాల శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. రోడ్లకు ఇరువైపులా పిచ్చి చెట్లను తొలగించి పరిసరాల శుభ్రతపై గ్రామంలో అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ జాంబ, మల్లేష్, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



జఫర్‌గఢ్ : విద్యుత్ సరఫరాలో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ వై.రాంబాబు సూచించారు. మండలంలోని ఓబులాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 5ఎంవీఏ పీటీఆర్‌ను డీఈ శుక్రవారం ప్రారంభించారు. ఏడీఈ రణధీర్‌రెడ్డి, ఏడీఈ టీఆర్ఈ శ్రీధర్, ఏఈ విశ్వసాహితీ, ఏఈ టీఆర్ఈ కుమారస్వామి, సబ్ ఇంజనీర్ వరుణ్, సిబ్బంది లక్ష్మారెడ్డి, గుర్రం కుమార్, బానోత్ వాసు, పిట్టల అశోక్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫుట్‌బాల్ పోటీలు

జనగామ: జిల్లా కేంద్రం హన్మకొండ రోడ్డు సోషల్ వెల్ఫేర్ గురుకులంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–19 ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆయా జిల్లాకు చెందిన టీంలు లీగ్, నాకౌట్ దశలో హోరాహోరీగా తలపడి క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి.

ఏసీపీ, సీఐని సస్పెండ్ చేయాలి



జనగామ : మండలంలోని మరిగడి గ్రామానికి చెందిన పొన్నగంటి చిరంజీవిపై అక్రమ కేసులు బనాయించి, ఇష్టం వచ్చినట్టు కొట్టిన ఏసీపీ, సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని మాదిగ కుల సంఘం ఆధ్వర్యంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. జనగామ మాదిగ కుల సంఘం అధ్యక్షుడు ఉడుగుల కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి గాదెపాక రాంచందర్, ముఖ్య సలహాదారులు మేడే శ్రీనివాస్, రాజమౌళి, సుగుణాకర్ రాజు, కృష్ణ, ఉపాధ్యక్షులు బొట్ల శేఖర్, ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహరావు, గువ్వల రవి, బొట్ల మహేష్, సాగర్, మల్లిగారి రాజు, మామిడి లాజర్, జేరిపోతుల కుమార్ తదితరులు ఉన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ

తరిగొప్పుల: చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



పాలకుర్తి టౌన్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



దేవరుప్పులలో.. ఎంపీడీఓ సురేష్‌కుమార్



సాక్షి నెట్‌వర్క్ : పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా మండల కేంద్రాల్లో ఐలమ్మ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రభుత్వ అధికారులు, సీపీఎం, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, రజక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్డీఓ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ డీఎస్ వెంకన్న


పాలకుర్తి టౌన్: పూలమాల వేస్తున్న నవీన్


నర్మెటలో రజక సంఘం నాయకులు


బచ్చన్నపేటలో..

సాదాబైనామాను వినియోగించుకోవాలి


పరిశీలిస్తున్న తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి

తరిగొప్పుల : సాదాబైనామా ప్రక్రియను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ మొగుళ్ల మహిపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని పోతారం గ్రామంలో చేపట్టిన సాదాబైనామా నోటీసుల పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాదాబైనామా ద్వారా భూమి కొనుగోలు చేసిన రైతులు 2020లో మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మండల వ్యాప్తంగా సుమారు 2,200 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని చెప్పారు. నోటీసులు పొందిన రైతులు సంబంధిత పత్రాలను జీపీఓలకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆంధ్రయ్య, జీపీఓ మంజుల ఉన్నారు.